# సింగిల్ పేజీ కథలు

మా ఊరు తణుకు. నేను హైదరాబాద్ హైకోర్టులో ప్లీడరుగా పనిచేస్తున్నాను. మా ఊరంటే నాకు ప్రాణం. అక్కడ నుంచి ఏ క్లయింటు వచ్చినా వాళ్ల కేసు నా సొంత కేసులా భావించి వారికి న్యాయం చేకూర్చాలని ఆదుర్దా పడతాను.

ఒక రోజు మధ్యాహ్నం నేను క్యాంటీన్‌లో కాఫీ తాగుతూంటే ఒక అపరిచిత వ్యక్తి వచ్చి "సార్, మీ అన్న తిలక్‌గారి మిత్రుణ్ని. ఇద్దరం కలసి తణుకు హైస్కూలులో చదువుకున్నాం. మీ ముఖం చూడగానే తిలక్‌గారి తాలూకా అని చొరవతీసుకుని మమ్మల్ని పలకరించాను. నాదొక క్రిమినల్ కేసు ఉంది. ఆ కేసు చదివి, నాకు హైకోర్టులో మీరు సాయం చేయమని ప్రార్థిస్తున్నాను" అని ఎంతో వినమ్రంగా అభిమానంగా అడిగాడు. సాయంకాలం ఇంటికి వచ్చి కలవమని చెప్పి నా ఎడ్రసు, ఫోను నెంబరు ఇచ్చాను.

సరిగ్గా నాలుగు గంటలకు మూర్తిగారు రికార్డు తీసుకుని వచ్చారు. మనిషి చాలా నిస్పృహలో ఉన్నాడు.

"ఏమిటి విషయం?" అని అడిగాను.

చాలా పెద్ద రికార్డు. రికార్డులోంచి అవసరమైన పేపర్లు తీసి ఒక్కొక్కటే నాకు ఇచ్చాడు. "నేను రెవెన్యూ శాఖలో చిన్న ఉద్యోగిని. నా జీతం నెలకు 150 రూపాయలు. నాకు ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలూ ఉన్నారు. జీతం మా జీవనోపాధికే సరిపోదు. దానికి తోడు దురదృష్టవశాత్తు నా మీద 3 సెక్యూరిటీ కేసులు ఏలూరులో పెట్టారు. మా ఊరికి ఇంచుమించు సాక్షిని తీసుకుని కోర్టులో హాజరుకావల్సి ఉంది. సాక్షికి భోజనం టిక్కెట్టు నేనే పెట్టుకోవాలి. క్రితం ఆరు నెలల నుంచి కేసు ఎప్పటికప్పుడు వాయిదా పడుతూంది. ఈ ఖర్చు భరించే శక్తి నాకు లేదని" విలపించాడు. తన పిల్లలకు రెండు పూటల కడుపు నిండా భోజనం పెట్టలేకపోతున్నానని ఎంతో మదనపడ్డాడు. ఉన్నట్టుండి ఒక్కసారి ఆయన కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. సిగ్గు వదిలి నా కాళ్ల మీద పడి తనను ఎలాగైనా రక్షించాలని, ఫీజు ఎంతైనా తన తల తాకట్టు పెట్టయినా ఇచ్చుకుంటానని, ఈ నరకంలోంచి బయటపడేయమని బ్రతిమాలుకున్నాడు. ఆయన్ని చూస్తే ఎవరికైనా జాలి కలుగుతుంది. శ్రద్ధగా పేపర్లు అన్నీ చదవి చూస్తే పోలీసులు తీసుకున్న సాక్ష్యానికి, కోర్టులో పెట్టిన చార్జీలకు సంబంధం కనిపించలేదు. ఈ కేసులు నిజంగా ఇతన్ని బాధపెట్టడానికి కల్పించి పెట్టిన కేసుల్లా కనిపించాయి.

"చార్జీలకూ సాక్ష్యానికి పొత్తు కుదరటం లేదు. హైకోర్టులో క్యాష్ ప్రొసీడింగ్స్ వేస్తే మీరు తప్పక నెగ్గుతారు. కింద కోర్టులోని కేసులన్నీ ఒకేమారు కొట్టివేస్తారు. అంతవరకూ నేను మీకు వక్కాణించి చెప్పగలన"ని ఆయనతో చెప్పాను.

"నిజంగా. అంత అదృష్టమే నా బ్రతుక్కి. దేవుడంటూ ఉన్నాడో లేడోకానీ మీరు ఇప్పుడు, నన్ను ఆదుకుందుకు వచ్చిన భగవంతుడులా కనిపిస్తున్నాడు" అంటూ కళ్ల నిండా చేరిన అశ్రువుల్ని తుడుచుకుంటూ కుర్చీలోంచి ఒక్కసారి లేచి నా కాళ్లు రెండూ పట్టుకొని బొటబొటా కన్నీళ్లు కార్చాడు. నిరాశ

## ఇది కథ కాదు

నిస్పృహలో ఉన్న మూర్తిగారికి హృదయంలో ఆశ పుట్టుకొచ్చింది. నాకు ఎన్నోసార్లు అభినందనలు చెప్పాడు. ఆయన తరపున నేను కేసులు వేయటం జరిగింది.

శుక్రవారం 11 గంటలకు జడ్జి పార్థసారథిగారి దగ్గర ఈ మూడు కేసులు హియరింగుకి వచ్చాయి. సాక్ష్యానికి పెట్టిన చార్జీలకు సమన్వయం లేదని, కేసులో పెట్టిన సాక్ష్యం చార్జీలను బలపరచటం లేదని ఇదే జడ్జిగారు, జడ్జి కాకముందు మద్రాసు హైకోర్టులో తాను చేసిన కేసును గురించి ఆ కేసు లా జర్నల్‌లో కూడా రిపోర్టు అయిందని ఆయన నాకు చెప్పగానే, ఆయనకు రిపోర్టు అయిన కేసు తీసి చూపించాను. ఆయన మూర్తిగారి కేసులో సాక్ష్యం చార్జీలు పూర్తిగా చదివిన తర్వాత ఈ కేసులో చార్జీలు నిరూపించడానికి కావలసిన సాక్ష్యం లేదని మూర్తిగారి మీద పెట్టిన మూడు కేసులు కొట్టివేస్తానని చెప్పారు. కానీ ఆ రోజున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారికి నోటీసు ఇవ్వాల్సి వచ్చింది. అందుకని ఈ కేసులు సోమవారం నాటికి పోస్టు చేయమని జడ్జిగారు ఆర్డరు వేశారు.

ఎప్పుడైతే జడ్జిగారు కింద కోర్టులో పెట్టిన కేసులు కొట్టివేస్తానని చెప్పారో, అప్పుడు మూర్తిగారి ఆనందానికి అవధుల్లేవు. ఆయన తిరిగి సోమవారం పొద్దున్న వస్తానని సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

సోమవారం ఉదయం మూర్తిగారు కోర్టులో కలిశారు. నాలో నిరుత్సాహం చూసి "అలా ఉన్నారేం ప్లీడరుగారూ" అని అడిగాడు.

"మూర్తిగారూ... మీరు నిజంగా దురదృష్టవంతులు. ఎందుకంటే ఈ కేసులు విన్న జడ్జి పార్థసారథి గారు మారిపోయారు. ఇది ఇంకో జడ్జిగారి దగ్గర వేశారు. ఆయన ఏం చేస్తాడో" అన్నాను. మూర్తిగారు ఒక్కసారి అవాక్కయిపోయాడు. 10 నిమిషాల వరకూ ఇలా కేసులు వేసిన జడ్జిగారు రాలేదు. కోర్టు హాలులో అలజడి ప్రారంభమైంది. ఏమిటా అని వాకబు చేస్తే జడ్జిగారు రావటం లేదని, ఈ కేసులన్నీ తిరిగి పార్థసారథిగారే వింటారని నోటీసు పెట్టారు. ఆహా! అదృష్టం వచ్చినట్లే వచ్చి మాయమయింది. మళ్లీ అదే అదృష్టం మూర్తిగారికి కలిసి వచ్చింది. జడ్జి పార్థసారథిగారు మూర్తిగారి మీద పెట్టిన 3 సెక్యూరిటీ కేసులు కొట్టివేశారు. కించిత్ అదృష్టం ఉంటే కానీ క్లయింట్ కేసు నెగ్గడం కష్టమే అనుకుంటారు.

**-దేవరకొండ పార్థసారథి (హైదరాబాద్)**

***

## జాతస్య మరణం ధృవం

అది అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారిగా ద్వారకానాథ్ పనిచేస్తున్న రోజులు. ఆయనంటే చదువుకునే విద్యార్థులకే కాక, చదువుచెప్పే అయ్యోర్లకు కూడా గుండె దడ. ఎక్కడా రాజీలేని ధోరణి ఆయనది. 'చండశాసనుడు', 'యముడు' అనేవి టీచర్లు ఆయనకు తగిలించిన బిరుదులు. కానీ ఆయన దానికి గర్వపడేవాడు కానీ బాధపడేవాడు కాదు. ఆయన స్కూళ్ల తనిఖీకి వచ్చినపుడు ఎప్పుడూ కూడా అధికార లాంఛనాలతో రావడం జరగలేదు. సాదాసీదాగా ఉన్నట్టుండి స్కూళ్లల్లో ఏ తరగతి గదిలోనో ప్రత్యక్షమయ్యేవాడు. ఆ తరువాతే మిగిలిన వారిని కలిసేవాడు. ఒక్కొక్కసారి పాఠశాల తెరవక ముందే వచ్చి టీచర్ల సమయపాలనను పరీక్షించేవాడు. ఆయన వేరే జిల్లాకు బదిలీ కావాలని టీచర్లు బహుశా ముక్కోటి దేవతలకు ముడుపులు కట్టుకొని ఉండొచ్చు. కానీ అవి ఇంకా నిజాయితీకి విలువనిచ్చే రోజులు. కనుక వారి ఆశ చాలా కాలం తీరకనే ఉండిపోయింది.

ఒకసారి అకస్మాత్తుగా జిల్లా కేంద్రంలో ఉన్న పాఠశాల తనిఖీకి ద్వారకానాథ్ వెళ్లడం జరిగింది. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఐదొందల పైచిలుకే. కానీ ఆ రోజు ఆయనకు అక్కడ ఒక్క విద్యార్థి గానీ, టీచర్‌గానీ

కనిపించలేదు. దీంతో ఆయన అవాక్కై పక్కనున్న క్యాంటీన్‌లో విచారిస్తే ఆ స్కూలు అటెండర్ హఠాత్తుగా మరణించడంతో పాఠశాలకు సెలవు ప్రకటించి స్టాఫ్ అంతా దహనక్రియలకు వెళ్లారని తెలిసింది. దీంతో ఒళ్లుమండి ద్వారకానాథ్ అప్పటికి తనెవరో కూడా చెప్పకుండా వెళ్లిపోయినా, మరుసటిరోజు మాత్రం ఎన్నడూ లేని విధంగా అధికార లాంఛనాలతో స్కూలులోకి ప్రవేశించి వెంటనే సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా సదరు హెడ్మాస్టర్‌ని ఆదేశించడం జరిగింది. ఆ సమావేశంలో స్టాఫ్‌నందరినీ దులిపేశినట్లు ఏకేశాడు. ఆఫ్టరాల్ ఒక అటెండర్ మరణిస్తే పాఠశాలకు సెలవు ప్రకటించి, ఐదు వందల విద్యార్థులను ఒకరోజు పాటు వీధిన పడవేసే హక్కు మీకెవరిచ్చారని రంకెలేశాడు. కొంతమంది టీచర్లు ఎంతో వినయంగా ఆ అటెండర్ ఎంతో ఉదాత్తమైన వ్యక్తి అని, గత ఇరవై ఏండ్లుగా అతను పాఠశాలకు తన సేవలనందిస్తున్నాడని, పిల్లల పట్ల కూడా అవ్యాజమైన అనురాగంతో ఉండేవాడని, ఆయన మృతికి సంతాపం ప్రకటించడం తమ కనీస బాధ్యత అని చెప్పడంతో ద్వారకానాథ్‌కు మరింత చిర్రెత్తింది. పాఠశాలకు అనధికార సెలవు ప్రకటించడమే కాక నాకే ధర్మపన్నాలు చెబుతారా అంటూ పిచ్చి ఊగుడు ఊగేడు. 'జాతస్య మరణం ధృవం' అని తెలియదా అంటూ... వారు చేసినది అనాలోచిత చర్యగా పేర్కొంటూ అందరి ఇంక్రిమెంట్లలోనూ కోత పెట్టి హుటాహుటిన వెళ్లిపోయాడు.

కాలం ఎప్పుడూ ఒక్కలా ఉండదు కదా! ఒకరోజు అకస్మాత్తుగా ద్వారకానాథ్ అల్లుడు ప్రమాదంలో మరణించాడు. ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టి అంత్యక్రియల కార్యక్రమంలో తలమునకలై ఉన్నాడు. పరామర్శకు కూడా ఒక్క టీచర్ రాకపోవడంతో ఆయన కుమిలిపోయాడు. ఏదో రకంగా కర్మకాండ పూర్తిచేసుకొని ఇంటికి వచ్చిన మన ద్వారకానాథ్‌కు టేబుల్ మీద కొన్ని వందల టెలిగ్రాంలు కనిపించాయి. వాటినన్నింటినీ తెరచి చూసిన ఆయన కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు. చావంటే ఏంటో ఆయనకప్పుడు తెలిసొచ్చినట్టుంది. ఇంతకూ జిల్లా వ్యాప్తంగా అందరు టీచర్లు పంపిన అన్ని వందల టెలిగ్రామ్స్‌లో ఉన్న ఏకైక సందేశం.

'జాతస్య మరణం ధృవం'

**-జి.ఎల్.నరసింహప్రసాద్**
**(తిరుపతి)**

***

# తానొకటి తలచిన...

చిలిపోలోమంటూ చలాకీగా సందడిగా తిరిగే సరోజ ఈసారి సెలవులకి పట్నం నుంచి వచ్చిన దగ్గర్నించీ అదోలా ఆందోళనగా ఉండడం గమనించాడు శేషు. అంతేకాదు, ఏ పొద్దూ వీధరుగు మీద బిత్తరచూపులు చూస్తూ నిలబడుతుంది. పోస్ట్‌మేన్ కోసమో, ప్రియుడి కోసమో మరి!

దీని భావమేమి తిరుమలేశ? దానికింత ఆలోచనేల! మోసపోయింది చిలక. రూఢి చేసుకుంటే చాలు రొట్టె విరిగి నేతిలో పడ్డట్లే. మేనల్లుడని కూడా చూడకుండా కుక్కని విదిలించినట్లు ఛీఛీ అంటున్న చలమయ్యగారి పిలక చేతిలోకొచ్చినట్లే.

ఆలోచనలాపి నూతనోత్సాహంతో ఉషారుగా ఈల వేస్తూ వచ్చాడు సరోజ దగ్గరికి. "సరోజా!" పిలిచాడు ప్రేమగా.

వీధరుగు స్తంభాన్ని కావలించుకొని ఆలోచనల్లో మునిగి ఉన్న సరోజ ఉలిక్కిపడి చూసింది. "నువ్వా! మా నాన్నేమో అనుకొని హడలిపోయాను." అంది స్థిమితపడుతూ.


"సరూ, ఎందుకు నీలో నువ్వే బాధపడతావు? నేను లేనా! నాకు చెప్పు విషయమేమిటో. నిమిషాల మీద చక్కపరుస్తాను" అన్నాడు కాలరు సర్దుకుంటూ.

"నేను బాధపడుతున్నానని నీకెలా తెలుసు బావా!" అంది ఆశ్చర్యంగా కళ్లింత చేసుకుని చూస్తూ. ఎంత తెలివైనవాడు శేషు! చెప్పకుండానే గ్రహించేశాడు. అమ్మకీ నాన్నకీ చెప్పడు కదా! భయంగా చూసింది.

"అది కూడా పెద్దబ్రహ్మ విద్యేనా ఏం. సామాన్యంగా కాలేజీలో చదువుకునే అందమైన ఆడపిల్లలందరికీ ఉండే సమస్యే. ఈ అసలు సంగతి చెప్పు. మోసం చేసినట్లేనంటావా? మాట తప్పినట్లేనా?" చీకట్లో రాయి విసిరాడు.

"అలాగే అనిపిస్తుంది బావా. నీ వెనకే నేనొస్తానన్న మనిషి, నేనొచ్చి వారం దాటుతున్నా ఇంతవరకూ జాడా జవాబూ లేదు. అంతగా రావడానికి వీలుగాని పరిస్థితే వస్తే ఆ విషయం తెలియజేస్తూ ఉత్తరమైనా రాయొచ్చు కదా!"

శేషు ఆనందానికి హద్దు లేకుండా పోయింది. తన అంచనా కరెక్టే. పీకలదాకా కూరుకుపోయింది పిల్ల.




"నీలాంటి వాజమ్మకి నా పిల్లనిస్తానా! కాలు పట్టుకు ఈడుస్తుంటే చూరుపట్టుకు వేలాడినట్లు ఛీ అన్నా ఛీ అన్నా ఇల్లు వదిలిపెట్టవు." అని చీదరించుకుంటాడీ మేనమామ. "మామా! నీ ఆట కట్టిస్తా" అనుకున్నాడు గర్వంగా మనసులో.

"అమ్మ సంగతి నీకు తెలుసుగా బావా. ఆవలిస్తే పేగులు లెక్కపెడుతుంది. నాన్నకి తెలిస్తే చంపేస్తాడు. ఎన్నాళ్లు దాగుతుందీ రహస్యం! ఎక్కడ పసిగడతారో అని హడలి చస్తున్నాననుకో" కళ్లు తుడుచుకుంది సరోజ.

"బుద్ధిగడ్డి తిని కాదని తినలేకపోయాను ఆ నిమిషంలో. అదేంటో మధు మాట్లాడుతుంటే మత్తు మందు చల్లినట్లే. ఇప్పుడేం చెయ్యను బావా?" బేలగా చూసింది శేషువైపు.

"సరూ, నువ్వేం కంగారు పడకు. ఇవాళే పట్నం వెళ్లి ఆ మధూ ఎక్కడున్నా సరే లాక్కొచ్చి నీ కాళ్ల దగ్గర పడెయ్యకపోతే నా పేరు ఆదిశేషే కాదు" సంతోషం దాచుకోలేకపోతున్నాడు శేషు. అమ్మాయిగారి మెడలో మూడుముళ్లూ వేసి మేనమామ యావదాస్తికి వారసుడు కావడానికి ఎంతో సమయం లేదు. అయ్యా కూతురూ తననో ఈగనో, దోమనో అన్నట్టు చూశారిన్నాళ్లూ. ఇప్పుడు నా కాళ్లు పట్టుకొని కనికరించమని వేడుకోక తప్పని పరిస్థితి.

"నువ్వెంత మంచివాడివి బావా, ఇన్నాళ్లూ తెలిసో తెలియకో ఏదేదో అన్నాను, నన్ను క్షమించు బావా"

"ఛఛ మనలో మనకి క్షమాపణలేంటి సరూ. నేను నీకు పరాయి వాడినా! ఏదీ ఆ మధు అడ్రసు ఇచ్చి ఏం చెప్పమంటావో చెప్పు" అన్నాడు హుషారుగా.

ఎవరైనా వింటున్నారేమోనని ఒకసారి అటూ ఇటూ చూసి నెమ్మదిగా చెప్పింది సరోజ. "ఎస్.మాధవి, సెకండ్ బి.ఎ. అంటే చాలు బావా ఎవరైనా చెపుతారు కాలేజీలో. హాస్టల్లోనే ఉంటుందది. ఎక్కడికీ వెళ్లదు"

"మధు అంటే మాధవీనా?" అయోమయంగా చూశాడు.

"అదే. నా క్లాస్‌మేట్ మాధవి. దీనికి సమయానికి ఇంటి దగ్గర్నించీ మనియార్డరు రాలేదు. పరీక్ష ఫీజు కట్టడానికి ఆ రోజుతో ఆఖరు. ఏం చెయ్యనే ఇప్పుడు అని అది ఏడుస్తుంటే చూడలేక నా బంగారు గాజులు తాకట్టు పెట్టి డబ్బు సర్దా. వారం రోజుల్లో విడిపించుకొస్తానంది గదా అని ధైర్యంగా ఉన్నా ఇన్నాళ్లూ. అమ్మకి తెలియకుండా ఉండాలని రోల్డ్‌గోల్డ్ గాజులేసుకున్నాను. ఇప్పుడు చూశావా అజాపజా లేకుండా..."

కళ్లు తిరుగుతున్నట్లుగా అనిపించి పడిపోకుండా స్తంభాన్ని కావలించుకున్నాడు పాపం శేషు.

**-జె.సరస్వతి (గుంటూరు)**